క్లుప్తంగా

డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు



భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ డిప్యూటీ చీఫ్ మినిస్టర్, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను అంబేద్కర్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్, సింగరేణి రిటైర్డ్ జీఎం అందెల ఆనందరావు శనివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ చాంబర్‌లో పుష్పగుచ్ఛం అందజేసి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మద్దెల మాట్లాడుతూ.. భట్టి.. భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కృషి చేస్తూ, పేద, దళిత, బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిస్తూ జనరంజకమైన పరిపాలనను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆనంద్, ప్రముఖ గాయని ఆమని, కుసుమ భోగరాజు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్, వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ 23వ వార్షికోత్సవం సందర్భంగా జరగనున్న డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను విజయవంతం చేయాలని, ఆ సంస్థ బ్రాంచి మేనేజర్ జక్కుల సతీష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా డిసెంబర్ చివరి వరకు ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందని, పోటీలు నిర్వహించదలచిన స్కూల్ యాజమాన్యాలు సంప్రదించాలని కోరారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన స్కూల్ యాజమాన్యాలు 9666261100 నంబర్‌లో ఈ నెల 25వ తేదీ వరకు సంప్రదించవచ్చని తెలిపారు.

ఐఎన్‌టీయూసీలో చేరిక

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి జేవీఆర్ ఓసీ ఈపీ ఆపరేటర్లు శనివారం ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ మాట్లాడుతూ.. ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గుర్తు గడియారంపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావి నాగేశ్వరరావు, అప్పారావు, రాజేశ్వరరావు, రామారావు, భిక్షపతి, ఆర్.శ్రీను, బాలకృష్ణ నాయక్, సురేష్, ప్రసన్న, తిరుమలరావు, మోయిన్ పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోండి..

జూలూరుపాడు: స్థానిక సాయి ఎక్స్‌లెంట్ స్కూల్‌లో శనివారం హార్ట్ బీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్ హార్ట్ బీట్ ఫౌండేషన్ నిర్వాహకులు రాకేష్ మాట్లాడుతూ.. సర్వేంద్రియానం నయనం ప్రధానమన్నారు. తనకు కంటిచూపు లేకపోవడంతో ఎన్నో రకాలుగా ఇబ్బంది పడుతూనే బ్రెయిలీ లిపి ద్వారా లా పూర్తి చేసినట్లు చెప్పారు. అన్ని అవకాశాలు ఉన్న కళ్లు ఉన్న మీరంతా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. విద్యలో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కరస్పాండెంట్ ఆరెబోయిన కృష్ణ ప్రసాద్, టీచర్లు నాగవేణి, మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. చిరాగ్ ఆర్గనైజేషన్, యూఎస్‌ఏ స్వచ్ఛంద సంస్థ వారు అందించిన స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బృందం రాంశెట్టి శ్రీనివాసరావు, రామనాథం, జి.వెంకటేశ్వర్లు, ఉమ, శాంతకుమారి, పటేల్, కృష్ణ, సిబ్బంది లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో సీఎండీకి శుభాకాంక్షలు



రిజ్వీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు ఎం.ఏ.వజీర్, డి.రాధాకృష్ణ, స్వామి, అంబాల శ్రీనివాస్, కె.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త వాహనాలకు సుస్తీ

- ఇల్లెందులో ఆరు నెలలుగా కదలని వాహనాలు
- మరమ్మతుల పేరిట పది వాహనాలు మూలకు..
- పట్టించుకోని యంత్రాంగం



మరమ్మతులతో మూలన పడిన స్వచ్ఛ వాహనాలు

ఇల్లెందు: మున్సిపల్ పాలన పడకేసింది. ఒకవైపు ఎన్నికలు.. మరోవైపు నిన్నటి వరకు అధికార పక్షంలో గ్రూపుల తగాదాలు.. వెరసి పాలన మీద తీవ్ర ప్రభావం పడింది. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీల్లో పోలిస్తే ఇల్లెందు మున్సిపాలిటీలోనే తొలిసారి చెత్త సేకరించేందుకు వార్డుకు ఒక వాహనం చొప్పున సమకూర్చారు. కానీ ఈ వాహనాల్లో సగానికి పైగా ఆరు నెలలుగా మూలన పడ్డాయి. ఉన్న వాహనాలతోనే వార్డుల్లో చెత్త సేకరిస్తున్నారు. మరమ్మతులకు చేరుకున్న వాహనాల జోలికి వెళ్లడం లేదు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో పక్కన పెట్టిన వాహనాలు తుప్పు పడుతున్నాయి.

రూ.కోటికి పైగా నిధులతో...

2020 నవంబర్‌లో పట్టణంలో చెత్త సేకరించేందుకు సుమారు రూ.కోటి పైగా నిధులు వెచ్చించి 20 వాహనాలు కొనుగోలు చేశారు. ప్రతీ వార్డుకు ఒక వాహనం అందుబాటులోకి తీసుకొచ్చారు. వార్డులో ప్రతీ ఇంటి నుంచి తడి–పొడి చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలించాలని నిర్ణయించారు. ఒక్కో వాహనానికి రూ.4.80 లక్షలతో ప్రత్యేకంగా తడి–పొడి చెత్తకు వేర్వేరుగా డబ్బాలు అమర్చిన వాహనాలను తయారు చేయించారు. తడి చెత్తకు గ్రీన్ బాక్సు, పొడి చెత్తకు బ్లూ బాక్సు ఏర్పాటు చేశారు. అలాగే ఈ వాహనాలకు మైక్ ద్వారా ప్రచారం చేసుకుంటూ ఆయా వార్డుల్లో ఇంటింటికీ చెత్తను తరలించుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అంతేగాక ప్రతీ ఇంటికీ తడి చెత్తకు గ్రీన్ బుట్ట, పొడి చెత్తకు, బ్లూ బుట్ట రెండు బుట్టలు అందజేశారు. ఇళ్లల్లో తయారైన చెత్తను బుట్టల్లో భద్రపర్చుకుని ఈ వాహనానికి అందజేయాలి. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రతీ వార్డులో ఈ చెత్త సేకరణ వాహనం రెండు దఫాలు పర్యటించి చెత్తను తరలించుకు వెళ్లాల్సి ఉంది. ప్రతీ వాహనానికి ఒక డ్రైవర్‌ను నియమించి రూ.6 వేల వేతనం చెల్లించడమే కాక డీజిల్‌కు రూ.300 వరకు వెచ్చించాలని నిర్ణయించారు. వాహనానికి అమర్చిన మైక్ ద్వారా సమాచారం ఇస్తూ వార్డుల్లో చెత్త సేకరించటం ద్వారా పట్టణాన్ని స్వచ్ఛ మున్సిపాల్టీగా మార్చాలని నిర్ణయించారు. ఈ వాహనాలను ఏర్పాటు చేయటం ద్వారా ప్రతీ నెలా మున్సిపాల్టీకి అదనంగా రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుంది. చెత్త సేకరించినందుకు ఇప్పటికే రిక్షా పుల్లర్స్ ప్రతీ ఇంటికి రూ.50 వసూలు చేస్తున్నారు. ప్రతీ 400 గృహాలకు ఒక వాహనం ద్వారా చెత్త సేకరించి తద్వారా స్వచ్ఛ మున్సిపాల్టీగా మార్చాలని పాలకవర్గం నిర్ణయించింది.

మూన్నాళ్ల ముచ్చటే...

ఈ ప్రక్రియ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఆరు నెలలుగా వాహనాలు మొరాయించాయి. పట్టణంలోని 1, 2, 3, 4, 6, 9, 19, 20, 21, 24 వార్డులకు చెందిన వాహనాలు మరమ్మతులకు చేరుకున్నాయి. చెత్త సేకరణ వాహనాలు రిపేరులో ఉండటం వల్ల కొన్ని వార్డులకు రెండు మూడురోజులకోసారి చెత్త బండి వస్తోంది. దీనివల్ల ఇళ్లల్లో చెత్త నిల్వ పెరిగి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ఇక వార్డుల్లో కూడా చెత్త సేకరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. కేవలం 14 వాహనాల ద్వారా పట్టణంలో చెత్తను సేకరిస్తున్నారు. ఒక్కో వాహనం రెండు వార్డులకు తిరుగాల్సి వస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలకులు తక్షణం చెత్త వాహనాలను మరమ్మతులు చేయించి చెత్త సేకరించాలని లేదంటే స్వచ్ఛ మున్సిపాల్టీకి అర్థం లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు.



మున్సిపల్ కార్యాలయంలో ఉపయోగించని చెత్త సేకరణ వాహనాలు

మరమ్మతులు చేయించండి..



కొంతకాలంగా పది చెత్త సేకరణ వాహనాలు రిపేరులో ఉన్నాయి. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మూలన పడిఉన్నాయి. అయినా అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలంటే ప్రతీరోజు ఇళ్లల్లో చెత్తను తరలించుకు వెళ్లాలి. అన్ని వాహనాలు పని చేస్తేనే పట్టణం పరిశుభ్రంగా ఉంటుంది.

– కాళంగి హరికృష్ణ, ఇల్లెందు

పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి..



పట్టణంలో పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. ఇది జరగాలంటే పరిశుభ్రత పాటించాలి. చెత్త సేకరణను వేగవంతం చేయాలి. ప్రతీరోజు ఇంటి ముందుకు వాహనం రావాలి. కొంతకాలంగా వాహనాలు ప్రతీరోజు రావటం లేదు. రెండు మూడు రోజులకోసారి వస్తున్నాయి. చెత్త వాహనాలు ఎప్పుడూ నడిచేలా చూడాలి.

– నాయిని సైదులు, 2వ నెంబర్ బస్తీ, ఇల్లెందు

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పాదయాత్రగా వస్తున్న అయ్యప్ప మాలధారులు

సుజాతనగర్: అయ్యప్ప మాలధారుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నాయకులగూడెం గ్రామ సమీపంలో సామూహిక పడిపూజ ఘనంగా జరిగింది. పలువురు అయ్యప్పలు స్థానిక శివాలయంలో పూజా కార్యకమాలు నిర్వహించి అఖండ జ్యోతులు, అయ్యప్ప విగ్రహాలతో పాదయాత్రగా పడిపూజా స్థలానికి చేరుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో అయ్యప్పలు నడిచి తమ భక్తిని చాటుకున్నారు. మాలధారులు స్వామిని భక్తిశ్రద్ధలతో కొలుస్తూ తీర్థప్రసాదాలు, నైవేద్యాలు సమర్పించారు. అయ్యప్ప శరణుఘోషతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టండి

సుజాతనగర్: రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆర్.శ్రీనివాసరావు సూచించారు. కేవీకే ఆధ్వర్యంలో పాత అంజనాపురం రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులను వాడటం వల్ల నేల, నీరు, గాలి కాలుష్యం బారిన పడి దిగుబడులు గణనీయంగా తగ్గిపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు ప్రకృతి, సేంద్రియ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించి వ్యవసాయం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ముఖ్యంగా ఆవుపేడ, మూత్రంతో ద్రవ జీవామృతం, ఘన జీవామృతం తయారు చేసుకొని పంటలకు వాడాలని సూచించారు.

చిన్నారులకు చదువుతో పాటు ఆరోగ్యం



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీతామంగా తదితరులు

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువుతో పాటు ఆరోగ్యం అందుతుందని రామవరం సెక్టార్ సూపర్‌వైజర్ సీతామంగా అన్నారు. శనివారం రామవరం సెక్టార్ పరిధిలోని వనందాస్‌గడ్డ బస్తీలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. తల్లుల సమక్షంలో చిన్నారులతో పలకపై అక్షరాలను దిద్దించారు. అనంతరం సీతామంగా మాట్లాడుతూ.. ప్రతి చిన్నారిని తల్లిదండ్రులు తప్పక అంగన్‌వాడీ సెంటర్లకు క్రమం తప్పకుండా పంపించాలని తల్లులను కోరారు. అలాగే ప్రతి గర్భిణి, బాలింతలు కూడా తాము తీసుకుంటున్న ఆహారాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రతీఒక్కరు తప్పక రావాలని, కిశోరామృతంతో బాలికలకు మరింతగా పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కల్లూరి రజిత, సరోజిని, ఆయా కొమురమ్మ తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి

ఇల్లెందు: వార్డు ఆఫీసర్లు ప్రతీ వార్డులో ప్రధాన సమస్యలను సర్వే చేసి రిపోర్టు అందజేయాని, నల్లా లీకేజీలు ఎన్ని ఉన్నాయో పరిశీలించాలని, వీధి లైట్లు ఎక్కడెక్కడ వెలగటం లేదో లెక్కతేల్చాలని, శానిటేషన్ ఏఏ వార్డులో అత్యవసరమో గమనించాలని, ఒకేరోజు వార్డు మొత్తం సర్వే చేసి లెక్క తీయాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు వార్డు ఆఫీసర్లను ఆదేశించారు. శనివారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ... మూడు నెలలుగా ఎన్నికల కారణంగా ప్రజలు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుక రాలేకపోయారని తెలిపారు. ఇక మీద ప్రజల చెంతకు వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ యంత్రాంగం వెళ్లాలని, సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఆర్ఐ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, శ్రీనివాస్, విజయ్, ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే మొక్కలు పెంచండి



నర్సరీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు

ఇల్లెందురూరల్: ప్రజాభీష్టానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు పెంచేలా ప్రణాళిక రూపొందించుకోవాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నర్సరీ ఏర్పాటు పనులను శనివారం ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో ప్రతీఇంటికి ఆరు చొప్పున పంపిణీ చేసే మొక్కలను ప్రజలు ఇష్టంగా పెంచుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో పెంచిన మొక్కలతోపాటు భిన్నంగా ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో కొమ్ముగూడెం సర్పంచ్ సూర్నపాక రామయ్య, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

నేటినుంచి శ్రీమహా భాగవత ప్రవచనములు

కొత్తగూడెంటౌన్: ధనుర్మాస మహోత్సవముల సందర్భంగా రామవరంలోని శ్రీ సాకేత రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో నెల రోజుల పాటు శ్రీమహా భగవత ప్రవచనములు నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో కమిటీ సభ్యులు పేర్కొన్నారు. రామవరంలో 14 నంబర్ బస్తీలోని శ్రీసాకేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో 17వ తేదీ ఆదివారం నుంచి జనవరి 15వ తేదీ సోమవారం వరకు నెల రోజుల పాటు ఈ కార్యక్రమంల నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి ప్రవచనములు ప్రారంభం అవుతాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ పంచాయతీ అధ్యక్షుల ఎన్నిక

టేకులపల్లి: మండలంలోని యువజన కాంగ్రెస్ పార్టీ గ్రామపంచాయతీ అధ్యక్షులను శనివారం నియమించారు. ఇల్లెందు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మూడ్ గణేష్ చౌహాన్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భుక్య ఈశ్వర్ నాయక్ చేతుల మీదుగా ఎన్నికైన టేకులపల్లికి భుక్యా అనిల్, ముత్యాలంపాడుకు గుగులోత్ బాలాజీ, కొత్తతండా(జి)కి భుక్యా అనిల్, గొల్లపల్లికి వాంకుడోత్ సందీప్, కార్యదర్శిగా యాసారపు సత్యసాయిలను నియమించగా వారికి నియామకపత్రాలు అందజేశారు.

పత్తి రైతులను మోసం చేయొద్దు

సుజాతనగర్: నిబంధనల ప్రకారం పత్తి కొనుగోళ్లు చేయాలని, కొనుగోళ్లలో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మహ్మద్ ఇమాయిద్ హుస్సేన్ హెచ్చరించారు. సుజాతనగర్‌లోని ప్రైవేట్ పత్తి మార్కెట్ యార్డును శనివారం ఆయన సందర్శించారు. కొనుగోళ్ల తీరును పరిశీలించి ట్రేడర్స్‌తో మాట్లాడారు. కాంటాల్లో మోసాలకు తావు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలన్నారు. పత్తి అమ్మిన రైతులకు వెంటనే నగదు చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు సుజాతనగర్ చెక్ పోస్టు, ప్రైవేట్ మార్కెట్ ద్వారా రూ.22 లక్షల ఆదాయం మార్కెట్ ఫీజు రూపంలో వచ్చినట్లు తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

ఇల్లెందు: పట్టణంలోని వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, సీహెచ్ శ్రీను తెలిపారు. శనివారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ... ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తు చేసుకున్నప్పుడు మున్సిపల్ సిబ్బంది వచ్చి కొలతలు తీసుకుంటారని, వాటి ఆధారంగా రుసుము నిర్ణయిస్తారని తెలిపారు. దాని ఫీజు చెల్లించాలని, ఎవరైనా కొలతలు తగ్గించి చూపిస్తే 25 శాతం పెనాల్టీ విధిస్తామని హెచ్చరించారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

‘హెచ్‌ఎంఎస్’ను ఆదరించండి



మాట్లాడుతున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక సమస్యలే ఎజెండాగా కార్మికులే అధిష్టానంగా పనిచేస్తున్న నాన్ పొలిటికల్ ట్రేడ్ యూనియన్ హెచ్‌ఎంఎస్‌ను ఈనెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపించాలని ఆ సంఘం కొత్తగూడెం ఏరియా వైస్ ప్రసిడెంట్ ఆంజనేయులు, బ్రాంచి సెక్రటరీ ఆసీఫ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఏరియాలోని పీవీకే–5షాఫ్ట్ గని ఆవరణలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక శక్తిని నిర్వీర్యం చేసే రాజకీయ పార్టీల తొత్తు సంఘాలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. దేశంలో అతిపెద్ద కార్మిక సంఘమైన హెచ్‌ఎంఎస్ పొలిటికల్ పార్టీలకు తొత్తు కాదని, కార్మిక సమస్యలే ఏజెండాగా, కార్మికులే అధిష్టానంగా నాన్ పొలిటికల్ ట్రేడ్ యూనియన్‌గా పోరాటం చేస్తుందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో కార్మికులను అయోమయానికి గురిచేసి వారి ఓటును కాజేసి గద్దెనెక్కుదామనే తొత్తుసంఘాలను ఓటు హక్కు ద్వారా బుద్ధి చెప్పి నిస్వార్థ సేవలు అందించే హెచ్‌ఎంఎస్ యూనియన్ త్రాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, గోడ రమేష్, యాకూబ్, పూర్ణచందర్, ప్రసాద్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు కేసీఆర్‌కు రుణపడి ఉండాలి



మాట్లాడుతున్న రంగనాథ్

టేకులపల్లి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కారణంగా ఈ రోజు సింగరేణి యువరక్తంతో ఉరకలేస్తోందని, సుమారుగా ఇరవైవేలమంది యువతి యువకులు డిపెండెంట్, ఎక్స్‌టర్నల్ రిక్రూట్ మెంట్ ద్వారా సింగరేణిలోఉద్యోగం చేస్తున్నారని వీరంతా మొదటిసారి తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారని వీరంతా టీబీజీకేఎస్ బాణం గుర్తుపై వేసి గెలిపించాలని టీబీజీకేఎస్ ఇల్లెందు ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ దిండిగల రాజేందర్ కోరారు. ఈ మేరకు శనివారం కేటీసీలో జరిగిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 61వ సంవత్సరంలో అడుగుపెట్టిన వారు తమకు ఒక సంవత్సరం పనిచేసే అవకాశం అందించినందుకు కేసీఆర్‌కు రుణపడి ఉండాలన్నారు. సింగరేణిలో తెలంగాణ ఇంక్రిమెంట్ తీసుకునేవారు, హౌసింగ్ వడ్డీ రీయింబర్స్‌మెంట్ తీసుకునేవారు, ఉచిత కరెంట్ వాడుకునేవారు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం తీసుకున్నవారు, పీఎంఈ మస్టర్ తీసుకున్నవారు, స్పోర్ట్స్ ఓడీ తీసుకున్న వారు ఈ అవకాశం అందించిన బాణం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. సింగరేణిలో కార్మికుల సంఖ్య తగ్గడానికి జాతీయ కార్మిక సంఘాలే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో రాజు, సత్యనారాయణ, రామకృష్ణ, గౌస్ మియా, అజీజ్, భుక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించండి

టేకులపల్లి: తెలంగాణ నూతన ప్రభుత్వంలో లంబాడీ సామాజికవర్గానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని లంబాడీల ఐక్య వేదిక (లైవ్) రాష్ట్ర నాయకుడు మూడ్ అనిల్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. నూతన సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డికి, నూతన మంత్రివర్గానికి శుభాకంక్షలు తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద సామాజిక వర్గమైన లంబాడీలకు మంత్రివర్గంలో చోటు కల్పించి సామజిక న్యాయం పాటించాలనీ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో లంబాడీల అత్యధిక జనాభా శాతం ఉన్న 60 నియోజకవర్గాలలో మాత్రమే కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిందన్నారు. రాష్ట్రంలో గిరిజన లంబాడీలు ఎవరి పక్షాన ఉంటే ఆ ప్రభుత్వ ఏర్పాటు తథ్యం అన్నారు. రాష్ట్రమంతటా బంజారాలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అండగా నిలిచారన్నారు.

గత ప్రభుత్వంలో గిరిజనులకు జరిగిన అన్యాయం ఈ ప్రభుత్వంలో జరగకుండా చూసుకొని, ఆదివాసీ గిరిజన బతుకుల్లో మార్పు తీసుకురావాలని విన్నవించారు. గెలుపొందిన గిరిజన ఎమ్మెల్యేలు ఆదివాసీ గిరిజన ప్రజల సమస్యలపై దృష్టి సారించి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

మహిళలకు ‘మహాలక్ష్మి’పై అవగాహన



ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

జూలూరుపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యంపై శనివారం జూలూరుపాడులో సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పించారు. కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో మహిళలు, ప్రయాణికులకు ఉచిత బస్సు ప్రయాణంపై పాటల రూపంలో కళాకారులు చైతన్య పరిచారు. ఈ కార్యక్రమంలో కళాకారులు కాంపల్లి బాలు, నందు, ముసా నరేందర్, స్నేహ, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీలకు కేటాయించాలని, ప్రస్తుతం జరిగిన నియామకాన్ని రద్దు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 ప్రకారం జనాభా ప్రాతిపదికన జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్టీకి రిజర్వ్ చేయబడింది. ఇంతకాలం జెడ్పీ చైర్మన్‌గా ఉన్న కోరం కనకయ్య ప్రస్తుతం ఇల్లెందు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఏజెన్సీ ఏరియాలో ఎస్టీలకు రిజర్వ్ చేసిన చైర్మన్ పదవికి జనరల్ కేటగిరీకి చెందిన వైస్ చైర్మన్‌ను తాత్కాలికంగా జెడ్పీ చైర్మన్‌గా ఎంపిక చేయడం, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమన్నారు. ఆదివాసీలకు దక్కిన రాజ్యాంగ హక్కులను ఆపత్య వర్గాలు వారి చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం ప్రతీ చోట చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే జిల్లా చైర్మన్ పదవికి ఎన్నికలు నిర్వహించి మరో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని జెడ్పీ చైర్మన్‌గా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చట్ట ప్రకారం ప్రభుత్వంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు.

జీపీ కార్మికుల వేతనాలు పెంచండి



మాట్లాడుతున్న జనార్దన్

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, గతంలో కార్మికులు చేపట్టిన సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ కోరారు. ఇఫ్టూ కార్యాలయంలో శనివారం ఏర్పాటైన గ్రామపంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, చట్టబద్ధమైన హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జటంగి వెంకన్న, డి.ప్రసాద్, సారంగపాణి, మోహన్‌రావు, నర్సింహారావు, ఝాన్సీ, పద్మ, సుమలత, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం...



బాలికలను దత్తత తీసుకుంటున్న పాస్టర్లు

పాల్వంచ: యేసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయం అని యేసు కరుణా సువార్త మందిరం గౌరవ అధ్యక్షుడు, పాస్టర్ ఫిలిప్‌బాబు అన్నారు. పట్టణంలోని బాపూజీనగర్‌లోని యేసు కరుణా సువార్త మందిరంలో శుక్రవారం సాయంత్రం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయానికి చెందిన ఏడుగురు అనాథ బాలికలకు దుస్తులు అందజేశారు. అనంతరం ఆ బాలికలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వారు జీవితంలో స్థిరపడే వారకు వారికి ప్రతీనెల పుస్తకాలు, నిత్యావసరాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ఇన్‌చార్జ్ తులసి, చర్చి నిర్వాహకులు ప్రభుదాస్, కే.రవి, సత్యం, కిరణ్, మధు, రాజు, శివ, ప్రీతం, కాటయ్యబాబు, విజయ్, రంజిత్, కృష్ణ, సురేశ్, నాని, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ - 79979 58226
టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎస్. శేషయ్య - 99121 99148